క్లుప్తంగా

ఘనంగా దీపోత్సవం

జమీదగ్గుమిల్లి(పామర్రు): మండల పరిధిలోని జమీదగ్గుమిల్లిలోని శ్రీ సీతారామాంజనేయస్వామి దేవాలయంలో భక్తులు శనివారం దీపాలను వెలిగించారు. ఏకాదశి ఉపవాసం ఉండి సాయంత్రం ఆలయంలో విశేష పూజలు చేశారు. అనంతరం ఆలయప్రాంగణంలో దీపాలను వెలిగించి దీపపు పూజలను చేశారు. తదుపరి ఆలయంలోని స్వామికిపంచ హారతులను స్వామికి ఇచ్చారు. తీర్థప్రసాదాలను వితరణ చేశారు. భక్తులు కాకర్ల చంద్రవతి, కాకర్ల పుష్పావతి, శీతాల ధనలక్ష్మి, రావూరి ఉమా పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పనిచేద్దాం

కైకలూరు: పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలందరూ కలిసికట్టుగా పనిచేయాలని విశ్రాంత ఐఏఎస్ విజయ్‌కుమార్ చెప్పారు. ఐక్యతా విజయపథం పాదయాత్రలో భాగంగా శనివారం కై కలూరు చేరుకున్నారు. తాలూకా సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి ముందుగా నివాళి అర్పించారు. నాయకులు బొల్లవరపు ప్రవీణ్‌కుమార్, రుంజుల విల్సన్, సోమాల శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్‌కు రెండు అవార్డులు



గుడివాడ టౌన్: ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్‌కు రెండు అవార్డులు వచ్చినట్లు క్లబ్ అధ్యక్షుడు అర్జా ప్రసాదు తెలిపారు. విశాఖపట్నంలో జరిగిన 32వ వాకర్స్ ఇంటర్నేషనల్ సమావేశంలో ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఎస్వీ రవీందర్ చేతుల మీదుగా బెస్ట్ సర్వీసెస్, బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డు పొందినట్లు తెలిపారు. కృష్ణా జిల్లాలో 202 సేవా కార్యక్రమాలు నిర్వహించిన ఏకైక క్లబ్‌గా గుర్తించి ఈ అవార్డులు ప్రదానం చేశారని ఆయన తెలిపారు. క్లబ్ కార్యదర్శి వంగపండు బ్రహ్మాజీ, పూర్వ అధ్యక్షులు ఈశ్వర వెంకటేశ్వరరావు, కోనా రామారావు, వి. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి



గుడివాడలో స్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు

- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- ప్రత్యేక పూజలు

ముదినేపల్లి రూరల్: కైకలూరు, పామర్రు, గుడివాడ నియోజకవర్గాల్లో ముక్కోటి ఏకాదశి సందర్భంగా వైష్ణవ ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ముదినేపల్లి మండలంలో ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనాలు ఏర్పాటుచేయగా భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. వడాలి జగన్నాథ స్వామి ఆలయంలో ఉత్తర ద్వారం నుంచి భారీ సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. బలరామ సుభద్ర సహిత జగన్నాథస్వామి ఉత్సవ విగ్రహాలతో ఊరేగింపు నిర్వహించారు. ముదినేపల్లి పెదరామాలయం, ఊటుకూరు ప్రసన్నవేంకటేశ్వరస్వామి, ప్రొద్దువాక కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాలతో పాటు పలు రామాలయాల్లోని ఉత్తర ద్వారం ద్వారా భక్తులు స్వామివార్లను దర్శించుకుని పూజలు చేశారు.

తోట్లవల్లూరు: స్థానిక శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో ఆలయ అర్చకుడు విజయకుమార్ ఆచార్యుల ఆధ్వర్యంలో శనివారం వేకువజామున వేణుగోపాలునికి పూజలు నిర్వహించారు. స్వామి వారు ఉత్తర ద్వారం ద్వారా ఉదయం 5.30 గంటలకు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తుల దర్శనానంతరం గ్రామోత్సవం జరిగింది. ఆయా కార్యక్రమాలను ఆలయ ఈఓ హరిదుర్గా నాగేశ్వరరావు, గుమ్మస్తా శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు.

కైకలూరు: కైకలూరు భూ సమేత వేంకటేశ్వరస్వామి (మీసాల వెంకన్న) ఉత్తర ద్వారం ద్వారా శనివారం భక్తులకు దర్శనమిచ్చారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) దంపతులు స్వామివారిని తెల్లవారుజాము గడియల్లో దర్శించుకుని పూజలు చేశారు. గరుడ వాహనంపై ఆశీనులైన స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో వీఎస్‌కే. శేఖర్, ఆలయ చైర్మన్ బొప్పన శివకుమార్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు లోయ రంగారావు, ములగపాటి అయ్యప్పరాజు, కడారి ఝాన్సీరాణి, ముదునూరి సరోజ, పోలవరపు వెంకట పద్మావతి, బొండాడ కుమారి, ఎంపీటీసీ పంజా రాంబాబు, కన్నా రమేష్, కటికల రఘు, అర్చకులు అగ్నిహోత్రం ఫణి, మారుతీ ప్రసాద్ పూజలు నిర్వహించారు.

కలిదిండి: తాడినాడ భద్రాద్రి సీతారామ స్వామి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా శనివారం విశేషంగా పూజలు నిర్వహించారు. ఉత్తర ద్వార దర్శనం వేడుక వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

వానపాముల(పెదపారుపూడి): వానపాముల గ్రామంలో వేంకటేశ్వరస్వామిఆలయంలో ముక్కోటి ఏకదాశి పురస్కరించుని భక్తులకు శనివారం ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశారు. తెల్లవారు జామున 5 గంటల నుంచి భక్తులు స్వామి వారిని ఉత్తర ద్వార దర్శనంచేసుకున్నారు.తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పామర్రు: ముక్కోటి ఏకాదశి శనివారం పలు వైష్ణవ ఆలయాలలోని స్వామివార్లను ఉత్తర ద్వారం వద్ద వేంచేపు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. రుక్మిణీ సత్యభామా సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో ఏకాదశి వేడుకలను నిర్వహించారు. తదుపరి స్వామివారి ఉత్సవ మూర్తులను ఉత్తర ద్వారం వద్ద గరుడ వాహనంపై ఉంచారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివార్లను ఊరేగించారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు రొంపిచర్ల ప్రసాద్, ఆర్. గోపిల ఆధ్వర్యంలో నిర్వహించామని ఆలయ మేనేజర్ కందుల వెంకటరెడ్డి తెలిపారు. జమీదగ్గుమిల్లిలో శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయంలో, నిమ్మకూరులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు చేశారు.



కైకలూరులో స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే డీఎన్నార్ దంపతులు

గుడివాడ టౌన్: స్థానిక పాటిమీద వేంచేసియున్న వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఉత్తర ద్వార దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఏ విధమైన అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ నగరాజన్ షణ్ముగం తెలిపారు. వేకువ జాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

పమిడిముక్కల: మంటాడ వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామి వారిని ఉత్తర ద్వారం ద్వారా దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ ఈవో మాధవీలత ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మొవ్వ: మండలంలో ముక్కోటి ఏకాదశి వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. కృష్ణాలయాల్లో, వైష్ణవాలయాల్లో, రామాలయాల్లో ఉత్తర ద్వారాల ద్వారా భక్తులు పెద్ద ఎత్తున దేవతామూర్తులను దర్శించుకున్నారు. కూచిపూడి, పెదపూడి, పెదముత్తేవి, బార్లపూడి, భట్లపెనుమర్రు, పెడసనగల్లు, మొవ్వ, మువ్వలపాలెం, కొండవరం, వేములమడ, కోసూరు, కాజ, నిడుమోలు, చినముత్తేవి, మంత్రిపాలెం, గూడపాడు గ్రామాల్లోని దేవాలయాల్లో ఉత్తర ద్వార దర్శనాలు నిర్వహించారు.

మండవల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని ఆలయాల్లో పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. అల్లినగరం సత్యభామ సమేత రాజగోపాలస్వామి ఆలయం, మండవల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆడుదాం ఆంధ్రాపై అవగాహన ర్యాలీ

కై కలూరు: ఈ నెల 26 నుంచి ప్రారంభించనున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని అందరూ దిగ్విజయం చేయాలని ఎంపీడీవో వి.ఉమామహేశ్వరరావు శనివారం కోరారు. గ్రామ సచివాలయ వలంటీర్లు, గ్రేడ్-5 కార్యదర్శులు, పీడీ, పీఈటీలకు స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఒక రోజు శిక్షణ ఇచ్చారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. మండల పరిషత్ సూపరింటెండెంట్ సూర్యప్రకాష్, పీడీ, పీఈటీలు, సెక్రటరీ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

త్వరలో నాగపట్నంకు ప్రత్యేక రైలు

గుడివాడ టౌన్: రాష్ట్రంలోని క్రైస్తవుల కోరిక మేరకు త్వరలో విశాఖపట్నం నుంచి నాగపట్నంకు రైలు ఏర్పాటు చేయనున్నట్లు బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి శనివారం తెలిపారు. కొన్నాళ్లుగా దీనిపై రైల్వేశాఖ మంత్రితో చర్చించామని, ప్రయాణికులు ఏ మేరకు ప్రయాణిస్తారనే అంశంపై చర్చ జరుగుతుందన్నారు. మరోసారి రైల్వే మంత్రితో చర్చించి నాగపట్నంకు రైలు ఏర్పాటు చేస్తామన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు

కైకలూరు: ఆటపాక హోలీక్రాస్ స్కూల్ సమీపంలో సెయింట్ మేరీస్ మలంకర సిరియన్ క్యాథలిక్ సంఘం ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుక శనివారం రాత్రి నిర్వహించారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) కేక్ కట్ చేశారు. అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. సర్పంచ్ తలారి మణిమ్మ, ఎంపీటీసీ పట్టపు బాలమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా క్రిస్టియన్ మైనారిటీ కార్యదర్శి పాట్రిక్ పాల్, మహమ్మద్ గాలిబ్ బాబు, పాస్టర్లు, దైవజనులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నిమ్మకూరు(పామర్రు): మండల పరిధిలోని నిమ్మకూరులోని ఏపీ గురుకుల పాఠశాలలో శనివారం నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ పాల్గొన్నారు. శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేశారు. పూర్వ విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

టెలికాం ఎడ్వయిజరీ కమిటీ సభ్యుడిగా వలపర్ల

గుడివాడ టౌన్: టెలి కమ్యూనికేషన్ ఎడ్వయిజరీ కమిటీ సభ్యుడిగా పట్టణానికి చెందిన బీజేపీ నాయకుడు వలపర్ల వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు వలపర్లకు నియామకపత్రాలు శనివారం అందాయి. ఈ పదవిలో వలపర్ల వెంకటేశ్వరరావు వచ్చే ఏడాది జూలై 13 వరకు కొనసాగుతారని నియామక పత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వలపర్ల మాట్లాడుతూ గుడివాడ పట్టణ పరిసర ప్రాంతాల్లో నిలిచిపోయిన 4జీ ఏర్పాటు పనులు తిరిగి పునరుద్ధరించేందుకు కృషి చేస్తానని అన్నారు. వెంకటేశ్వరరావు నియామకం పట్ల బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామినేని వెంకటకృష్ణ, జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు, జిల్లా అధికార ప్రతినిధి సూరే గాంధి అభినందిచారు.

కైకలూరు: ఏలూరు జిల్లా టెలీఫోన్ సలహా కమిటీ సభ్యుడిగా బీజేపీ కిసాన్ మోర్చా ఏలూరు జిల్లా అధ్యక్షుడు కీర్తి వెంకట్ రామ్ ప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు నియామక ఉత్తర్వులు శనివారం అందుకున్నారు. రామ్‌ప్రసాద్‌ను శనివారం స్థానిక బీజేపీ నాయకులు అభినందించారు.

ఘనంగా రైతు దినోత్సవం

పామర్రు: పద్మశ్రీ ఘంటసాల కళాపీఠం ఆధ్వర్యంలో శనివారం రైతు దినోత్సవాన్ని నిర్వహించారు. రైతులను సన్మానించారు. కళాపీఠం అధ్యక్షుడు కాటూరి వెంకట మురళీ కృష్ణ మాట్లాడారు. జమీదగ్గుమిల్లి గ్రామానికి చెందిన రైతు శీతాల బాలకృష్ణ, పామర్రు గ్రామానికి చెందిన రైతు రామమోహన్‌రెడ్డిలను సత్కరించారు. ఆలయంలో గీతా జయంతి సందర్భంగా బావులపల్లి పద్మజ బృందం సభ్యుల ఆధ్వర్యంలో గీతాపారాయణ నిర్వహించారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, ప్రజాప్రతినిధులు

కైకలూరు: స్థానిక చిన్న చెరువుగట్టు నుంచి వైఎస్సార్ నగర్ చివరి వరకు రూ.కోటి జెడ్పీ నిధులతో రోడ్డు నిర్మాణం చేస్తున్నామని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) చెప్పారు. నిర్మాణ పనులను అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుత రోడ్డును విస్తరిస్తామన్నారు. ఇప్పటికే చిన్న చెరువు వద్ద నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయించామన్నారు. ఎంపీపీ అడవి వెంకట కృష్ణ, సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, ఎంపీటీసీ మంగినేని రామకృష్ణ, జిల్లా ముస్లిం, యువజన కమిటీల ప్రధాన కార్యదర్శులు షేక్ రఫీ, నిమ్మల సాయి, 4,5 పంచాయతీ వార్డు సభ్యులు పిచ్చికల రమ్య, జయసుధారాణి, నాయకులు ఎస్‌డీ.బాషా, కటికన రఘు, నాగిరెడ్డి కొండయ్య, పంచాయతీ రాజ్ డీఈ సురేష్, ఏఈ కృష్ణ కుమార్ పాల్గొన్నారు.

మండల యువజన విభాగ అధ్యక్షుల నియామకం


నీలి సుమన్


జంపన కోటయ్య


అచ్చుత శేషుబాబు

కై కలూరు: వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగ అధ్యక్షుల నియామకాలను తాడేపల్లి కార్యాలయం నుంచి పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో శనివారం ఉత్తర్వులు విడుదల చేశారు. కలిదిండి మండలానికి చెందిన ఎంపీటీసీ నీలి సుమన్, ముదినేపల్లి మండలానికి చెందిన ఎంపీటీసీ జంపన కోటయ్య, మండవల్లి మండలానికి చెందిన అచ్యుత శేషుబాబును నియమించారు. వైఎస్సార్ సీపీ నాయకులు పలువురు వీరిని అభినందించారు.

కొండలమ్మకు ప్రముఖుల పూజలు





గుడ్లవల్లేరు: వేమవరం కొండలమ్మ అమ్మవారిని జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్, గుడివాడ 11వ కోర్టు అడిషనల్ జడ్జి జి.సుబ్రహ్మణ్యం శనివారం దర్శించుకున్నారు. వారిని ఆలయ చైర్మన్ శేషం గోపి, ఈఓ సురేష్ ఆలయ మర్యాదలతో సన్మానించారు. అమ్మవారి చిత్రపటంతో పాటు లడ్డూ ప్రసాదాలను అందించారు. తొలుత వారి పేరిట అమ్మవారికి వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు.

మహిళాభ్యున్నతే జగనన్న ధ్యేయం



కుట్టు మిషన్లు అందిస్తున్న ఎమ్మెల్యే కొడాలి, జెడ్పీ చైర్‌పర్సన్ హారిక

గుడ్లవల్లేరు: మహిళల అభ్యున్నతే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ ధ్యేయమని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు (నాని) అన్నారు. శనివారం గుడ్లవల్లేరు మండలంలో 35 మంది మహిళలకు డాక్టర్ పట్టాభి మెమోరియల్ గ్రామీణాభివృద్ధి సంస్థ సౌజన్యంతో కుట్టు మిషన్లను అందజేశారు. లబ్ధిదారులకు ముందుగానే కుట్టు శిక్షణ ఇచ్చామని జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక తెలిపారు. 50 శాతం రాయితీతో ఈ మిషన్లను అందించినట్లు చెప్పారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన కార్యదర్శి ఉప్పాల రాము, ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు దుక్కిపాటి శశి భూషణ్, ఎన్టీఆర్ స్టేడియం వైస్ చైర్మన్ పాలేటి చంటి, ఎంపీపీ కొడాలి సురేష్, ఎంపీడీఓ డి.శ్రీనివాస్, తహసీల్దార్ అబ్దుల్ రెహ్మాన్ సుల్తానా పాల్గొన్నారు.

తిరుగులేని విలక్షణ నటుడు కైకాల

- ఎంపీ వల్లభనేని బాలశౌరి
- గుడివాడలో సినీనటుడు కైకాల సత్యనారాయణ కాంస్య విగ్రహావిష్కరణ



కైకాల విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే నాని, కైకాల కుటుంబ సభ్యులు

గుడివాడ టౌన్: సినీనట జీవితంలో 40 సంవత్సరాలు పైబడి తిరుగులేని నటుడుగా ఎదిగిన కైకాల విలక్షణ నటుడని బందరు పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి అన్నారు. శనివారం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కైకాల సత్యనారాయణ కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక సినిమాలో కైకాల ఒక పాత్ర నటిస్తే ఆ సినిమా నిర్మాత మరో సినిమా నిర్మించేటప్పుడు కచ్చితంగా కైకాల సత్యనారాయణకు ఒక పాత్ర ఇచ్చేవారని, అదే ఆయన నటనకు నిదర్శనం అన్నారు. అందుకే 800 పైబడి చిత్రాలలో నటించడమే కాక ఎన్టీరామారావుకు దూపుగా ఆయనతో కలిసి వంద సినిమాలకు పైబడి నటించగలిగారన్నారు. హాస్యం, కేరక్టర్, విలన్, హీరో ఏ పాత్రనైనా అవలీలగా ప్రదర్శించగల కైకాల విగ్రహాన్ని తాను ఆవిష్కరించడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. పట్టణ కాపు సేవా సమితి, కళాకారుల సమాఖ్య కోరిక మేరకు కైకాల సత్యనారాయణ కళామందిరాన్ని పునఃనిర్మాణానికి కృషి చేస్తానన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి సీఎస్ఆర్ నిధులు రూ.2 కోట్లు మంజూరు చేయించి కళాప్రదర్శనలకు అనుకూలంగా తీర్చిదిద్దుతానని బాలశౌరి హామీ ఇచ్చారు.

ఎన్టీఆర్‌కు అత్యంత సన్నిహితుడు : ఎమ్మెల్యే నాని

రాజకీయంగా తెలుగుదేశానికి కైకాల సత్యనారాయణ ఎంతగానో ఉపయోగపడ్డారన్నారు. 1996లో బందరు పార్లమెంట్ సభ్యుడిగా కైకాల పోటీకి ఒప్పించడానికి వెళ్లిన బృందంలో తాను ఒక సభ్యుడినని ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. ఎన్టీరామారావుకు అత్యంత సన్నిహితుడిగా ఉన్న సత్యనారాయణ ఆయన మృతి అనంతరం రాజకీయాలకు దూరంగా ఉన్నారని తెలిపారు. ఎన్నికల్లో పోటీకి నిరాకరించినా పార్టీ సంక్షేమం కొరకు పోటీ చేయాలని ఒత్తిడి తేగా, ఆయన ఎంపీగా గెలవడంతో పాటు కాపు సానుభూతిపరులను టీడీపీకి ఓటు వేయించడం ద్వారా బందరు పార్లమెంట్ నియోజకవర్గానికి సరిహద్దులో ఉన్న తెనాలి పార్లమెంట్ నియోజకవర్గంలో సినీ నటి శారద, ఏలూరు పార్లమెంట్ సభ్యుడు మాగంటి బాబులు అతి స్వల్ప మెజార్టీతో గెలిచారని తెలిపారు. కైకాల సత్యనారాయణ తాను గెలుస్తూ ఇరువురిని గెలిపించి తెలుగుదేశం పార్టీని ఆదుకున్న నాయకుడని, ఇంత గొప్ప రాజకీయ నాయకుని విగ్రహం, ఇక్కడ ఏర్పాటు చేయడంలో తన పాత్ర ఉండటం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కైకాల సత్యనారాయణ సతీమణి నాగేశ్వరమ్మ, కుమారులు వెంకట రామారావు, లక్ష్మీనారాయణ, తమ్ముడు కైకాల నాగేశ్వరరావు, కుటుంబ సభ్యులు, సమయం రాజశేఖర్, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, టిడ్కో చైర్మన్ ప్రత్తివాడ రాఘవరావు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గుదే లక్ష్మీరంగనాయకమ్మ, కాపు సేవా సమితి అధ్యక్షుడు పొన్నూరు రామకృష్ణ, నాయకులు ఆళ్ల చెన్నకేశవరావు, సుంకర గాంధి, అడబాల అప్పారావు, మట్టా రాజా, సీహెచ్ రామారావు, నల్లగంచు వెంకట రాంబాబు, ఎం.వెంకట సత్యనారాయణ, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు మాదాసు వెంకట లక్ష్మీకుమారి, వీరిశెట్టి నరసింహారావు, కళాకారుల సంఘం నాయకులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు ఆశీస్సులు అందరిపై ఉండాలి

ఆర్డీవో పద్మావతి



సెమీక్రిస్మస్ కేక్‌ను కట్ చేస్తున్న ఆర్డీవో పద్మావతి

గుడివాడరూరల్: ఏసుక్రీస్తు ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని గుడివాడ ఆర్డీవో పి.పద్మావతి పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఉద్యోగుల ఆధ్వర్యంలో సెమీక్రిస్మస్ వేడుకల్లో శుక్రవారం రాత్రి ఆర్డీవో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సెమీక్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ నేటి యువత ఏసుక్రీస్తు మార్గాన్ని ఆచరించాలని సూచించారు. రెవెన్యూ ఉద్యోగులు క్రిస్మస్ పండుగను ఘనంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. ఉద్యోగులందరికీ ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్ష తెలిపారు. తొలుత పాస్టర్స్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తహసీల్దార్ కె.ఆంజనేయులు, ఆర్డీవో కార్యాలయ ఏవోలు బాలాజీ, రజనీకాంత్, ఆర్ఐ నాగబాబు, వీఆర్వోల సంఘ అధ్యక్షుడు గూడపాటి లక్ష్మణరావు, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయ అధికారులు, ఉద్యోగులు, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తోట్లవల్లూరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సెమీ క్రిస్మస్ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఆసుపత్రి సమావేశపు హాలులో పాస్టర్ ఐజాక్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, దైవసందేశం వినిపించారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ సాయిప్రసన్న సిబ్బందితో కలిసి కేక్ కట్ చేశారు. సీహెచ్ఓ కోటేశ్వరమ్మ, హెచ్‌వీ రోహిణి, ఎంపీహెచ్ఎస్ అనిల్‌కుమార్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

పామర్రు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ క్రైస్తవ సంక్షేమ సంఘ అధ్యక్షుడు సాల్మన్ కొల్లాబత్తుల మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ ప్రపంచం అంతా జరిగే పండుగని, అందరూ సుఖ శాంతులతో ఉండాలనేది ఈ పండుగ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. తహసీల్దార్ భరత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దయ, శాంతి, క్షమ గుణాలను కలిగి ఉండాలన్నారు. ఎన్నికల డీటీ జగన్ మోహన్‌రెడ్డి, సిబ్బంది రాము, గుంటక ఆంజనేయరెడ్డి పాల్గొన్నారు.

ఏఎన్ఎంలో..

స్థానిక యలమర్రు రోడ్డులోని ఏఎన్ఎం హైస్కూల్‌లో సెమీక్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. తొలుత ప్రిన్సిపాల్ ఏ పూర్ణచంద్రారెడ్డి, కూచిపూడి ఆర్‌సీఎం చర్చి పాస్టర్ రఘు మాట్లాడారు. విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

గుడివాడ టౌన్: సెమీ క్రిస్మస్ వేడుకలు శనివారం పట్టణంలోని పలు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. పలువురు పాస్టర్లు దైవసందేశం ఇవ్వగా విద్యార్థులు గ్రూప్ డాన్స్‌లు, పాటలతో ఆనందోత్సాహంగా గడిపారు. త్రివేణి పబ్లిక్ స్కూల్, విద్యావికాస్, వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాలలో వేడుకలు జరిగాయి. పాఠశాలల యాజమాన్యం కేక్ కట్‌చేసి చిన్నారులకు శుభాలు తెలిపారు. విద్యావికాస్ పాఠశాలలో డైరెక్టర్లు ముప్పాళ్ల సుబ్బారావు, కొమ్మినేని సాంబశివరావు, పాఠశాల ప్రిన్సిపాల్ పి. ఆశీర్వాదం, ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్‌హెచ్‌వీ ప్రసాదరావు, కరస్పాండెంట్ కోదండరామయ్య, పాస్టర్లు డాక్టర్ ఫ్రాన్సెస్, కె.కృపానిధి, త్రివేణి పబ్లిక్ స్కూల్‌లో డైరెక్టర్ శంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్రా' ప్రారంభం

మండవల్లి: మండవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో క్రీడాపోటీలో పాల్గొని విద్యార్థులలో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చదువుతో పాటు శారీరక ఆరోగ్యానికి ఆటలు అవసరం అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ (రాము), సర్పంచ్ మెండా ఝాన్సీ, పార్టీ నాయకులు ముంగర మల్లికార్జునరావు, మెండా సురేష్, బి.యేసోబురాజు, కొల్లా కృష్ణ, డి.నాంచారయ్య, ఎంపీడీఓ వెంకటరమణ, ఎంఈవోలు రామారావు, రత్నసునాదం, హెచ్ఎంలు, ప్రసాద్, మాధవ్‌కుమార్, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

అక్షింతలు పంపిణీ

మండవల్లి: శ్రీరామ జన్మభూమి ట్రస్ట్ సంకల్పంతో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో, అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలు స్థానిక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద శనివారం పంపిణీ చేశారు. మండవల్లి ప్రముఖ్ ఇన్నా వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో మండలంలోని 25 గ్రామాల ప్రజలకు అక్షింతలు పంపిణీ చేశారు.

విద్యార్థులకు ఉన్నత చదువులే లక్ష్యం

టాబ్‌ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే డీఎన్నార్



మండవల్లి హైస్కూల్లో ట్యాబులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

మండవల్లి: విద్యార్థులకు ఉన్నత చదువుల సాకారం కోసం వారి భవిష్యత్తుపై మరింతగా నమ్మకం కలిగే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. రూ.17,500 విలువైన ట్యాబ్‌లు, రూ.15,500 విలువైన బైజూస్ కంటెంట్‌తో కలిపి 8వ తరగతి విద్యార్థులకు పంపిణీ చేసి, కార్పొరేట్ స్థాయిలో విద్యను అందిస్తున్న సీఎం జగన్‌కు ప్రత్యేక ధన్యవాదాలని ఆయన అన్నారు. మండవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం ఎమ్మెల్యే డీఎన్నార్ ఉచిత ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ట్యాబ్‌లలో 8వ తరగతితో పాటు 9,10 తరగతుల బైజూస్ కంటెంట్ నిక్షిప్తం చేసి ఉంటుందన్నారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసేందుకు వీలుగా అన్ని ట్యాబుల్లో అన్ని అంశాలు ఉంటాయని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్(రాము), సర్పంచ్ మెండా ఝాన్సీ, వైఎస్సార్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు బలే నాగరాజు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బి.యేసోబురాజు, సొసైటీ అధ్యక్షుడు బి.గోకర్ణయాదవ్, మల్లేశ్వరస్వామి ఆలయ చైర్మన్ కొల్లా కృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు ముంగర మల్లిఖార్జునరావు, మెండ సురేష్‌లు, డి. నాంచారయ్య, టి.అన్నిబాబు, కె.శివకృష్ణ, చావలిపాడు శ్రీను, ఎంపీడీఓ టీకే వెంకటరమణ, ఎంఈఓలు రామారావు, రత్నసునాథం, హెచ్ఎంలు ప్రసాద్, మాదవ్‌కుమార్, గోపాలకృష్ణ, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ప్రయోజనమే సంకల్పయాత్ర లక్ష్యం



తాడంకిలో వికసిత్ భారత్ ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీఓ విఠల్‌పాల్, సర్పంచ్ ధనలక్ష్మి

పమిడిముక్కల: దేశ ప్రజల ప్రయోజనమే భారత్ సంకల్ప యాత్ర ఉద్దేశమని ఎంపీడీఓ విఠల్‌పాల్ తెలిపారు. మండలంలోని తాడంకి గ్రామంలో శనివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలతో ప్రజలకు లభించే ప్రయోజనాలు, వివిధ సౌకర్యాలను మారుమూల గ్రామీణ లబ్ధిదారులకు చేరవేసేందుకు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర దోహదపడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన ఆయుష్మాన్ భారత్ యోజన, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, జల్ జీవన్ మిషన్ తదితర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సెంట్రల్ టీం డ్రోన్ ద్వారా పొలాల్లో మందు పిచికారీపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ చేశారు. కంటివెలుగు ద్వారా 36 మందికి కళ్లజోళ్లు అందజేశారు. సర్పంచ్ జంపాన ధనలక్ష్మి, వైద్యులు బాలాజీ, కార్యదర్శి బండారు సునీత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తపాలా స్టాంపుల ప్రదర్శనలో అంతర్జాతీయ పతకాలు



పతకాలను అందజేస్తున్న న్యాయమూర్తి

గుడివాడ టౌన్: అంతర్జాతీయ తపాలా బిళ్లల ప్రదర్శనలో పట్టణానికి చెందిన విద్యాలయ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌కు రజిత పతకం వచ్చినట్లు విజయవాడ మెట్రో పాలిటన్ కోర్టు న్యాయమూర్తి దేవు నరసింహారావు తెలిపారు. శనివారం విద్యాలయ డైరెక్టర్ బొప్పన విజయ భాస్కర్‌కు పతకాన్ని ఆయన అందజేశారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ ఇటీవల ఇండోనేషియాలోని బాలి నగరంలో అంతర్జాతీయ స్నేహపూరిత తపాలా బిళ్లల ప్రదర్శనలో భారతదేశానికి మొత్తం 9 పతకాలు రాగా న్యాయమూర్తి దేవు నరసింహారావు, విద్యాలయ హైస్కూల్‌కు రజిత పతకాలు వచ్చినట్లు ఆయన వివరించారు.

ఘనంగా గీతా జయంతి



భగవద్గీత గ్రంథాలను స్వీకరించిన విద్యార్థులతో సాంబశివరావు, ప్రసాద్

పమిడిముక్కల: గీతా సారాన్ని విశ్వవ్యాప్తం చేయాలని లయన్స్ క్లబ్ జిల్లా కోశాధికారి నూకల వెంకట సాంబశివరావు అన్నారు. మంటాడ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఇంటర్నేషనల్ బ్రాహ్మిన్ పార్లమెంట్ ఆంధ్రప్రదేశ్ విభాగం ఆధ్వర్యంలో గీతా జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేశారు. సభలో సాంబశివరావు మాట్లాడుతూ భారతీయ ఔన్నత్యానికి ప్రతీక భగవద్గీత గ్రంథమన్నారు. ఐబీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దినవహి ప్రసాద్ మాట్లాడుతూ భగవద్గీతలో 700 శ్లోకాలు ఉన్నాయని, ఒక్కో శ్లోకం ఒక నిధి లాంటిదన్నారు. ముక్కోటి ఏకాదశి, గీతా జయంతి పర్వదినాల సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఉయ్యూరు విజయసాయి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. గీతాపారాయణం చేశారు. కార్యక్రమంలో విజయవాడ భగవద్గీత వర్షిణి ప్రతినిధి రామకృష్ణ, ఆలయ ఈవో మాధవీలత, హైకోర్టు న్యాయవాది లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకం అందరి బాధ్యత



కలిదిండి: మొక్కల పెంపకాన్ని బాధ్యతగా తీసుకోవాలని సర్పంచ్‌మసిముక్కుల మారుతి ప్రసన్న అన్నారు. స్థానిక జెడ్పీహెచ్ఎస్ స్కూల్లో శనివారం దాతల సహకారంతో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. హెచ్ఎం స్వర్ణకుమారి, మసిముక్కుల వెంకటేశ్వరరావు, పాము రవికుమార్, ఉపాధ్యాయులు సున్న శ్రీనివాసరావు, దుర్గ, ఎంఎస్ స్వామి, ఝాన్సీ, శ్రీదేవి, పీఈటీ మాల్లేశ్వరరావు, విద్యా కమిటీ చైర్మన్ యు.థెరిసా, ఏసుబాబు పాల్గొన్నారు.

అలరించిన నగర సంకీర్తన

మండవల్లి: మండవల్లి షిర్డీసాయిబాబా భక్త సమాజం ధనుర్మాసం, పురస్కరించుకుని నిర్వహిస్తున్న నగర సంకీర్తన కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. శనివారం వేంకటేశ్వరస్వామి ఆలయం వైపు నగర సంకీర్తన నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే గృహస్తులను సాయినామ సంకీర్తనతో మేల్కొలుపుతారు. ఈ సందర్భంగా బండిపై ఉన్న బాబా విగ్రహానికి భక్తులు పూజలు నిర్వహించి బియ్యం, నగదు వేసి స్వామివారిని కొలుస్తారు. ఆలయ నిర్వాహకులు గుడివాడ చిట్టిబాబు, యిన్నా వెంకటేశ్వరరావు, పెరుమాళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.